క్లుప్తంగా

కాకినాడ రూరల్ ఎంపీడీఓగా సతీష్


ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న సతీష్

కాకినాడ రూరల్: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పసుపులేటి సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొండంగి మండలం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన కర్రే స్వప్న గొల్లప్రోలు బదిలీపై వెళ్లారు. కొత్తగా వచ్చిన ఎంపీడీఓకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

పరిపాలనపై అవగాహన పెంచుకోండి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అనుపమ

కరప: గ్రామ పరిపాలన, చట్టాలపై ప్రజా ప్రతినిధులు అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీవో మట్టపర్తి అనుపమ సూచించారు. స్థానిక సమావేశ మందిరంలో సోమవారం ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామ పంచాయతీల విధులు, నిధులు, వివిధ శాఖల పనితీరు, ఇతర అంశాలను వివరించారు. పంచాయతీల ఆదాయ వ్యయాలను ప్రజలకు వివరించారు. గ్రామాభివృద్ధికి ప్రణాళికలను రూపొందించుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడాలన్నారు. అరట్లకట్ట, గొర్రిపూడి కార్యదర్శులు వై.రామ్‌జీ హీరాలాల్, కె.సోమసుధారాణి కార్యదర్శులకు పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు.

బీచ్ ఫ్రంట్‌ను సందర్శించిన ఏపీ టూరిజం శాఖ చైర్మన్ బాలాజీ


కాకినాడ బీచ్ ఫ్రంట్‌లో పర్యటిస్తున్న టూరిజం శాఖ చైర్మన్ నూకసాని బాలాజీ, అధికారులు

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట న్యూ ఎన్టీఆర్ బీచ్ వద్ద బీచ్ ఫ్రంట్ అభివృద్ధిని ఏపీ టూరిజం శాఖ చైర్మన్ నూకసాని బాలాజీ సోమవారం సందర్శించారు. అన్నవరం నుంచి ఆయన కాకినాడ వస్తూ టూరిజం శాఖ అధికారులతో కలిసి బీచ్ ఫ్రంట్‌లో అభివృద్ధి పనులను పరిశీలించారు. టూరిజం శాఖ డివిజనల్ మేనేజరు పవన్‌కుమార్ బీచ్‌లో ప్రతిపాదిత, ప్రస్తుతం చేపడుతున్న పనులు గురించి చైర్మన్‌కు వివరించారు. కార్యక్రమంలో టూరిజం అధికారి పసుపులేటి పోశయ్య, ఏఈ వెంకట్, ఏపీఓ త్రిమూర్తులు పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్ నియామకానికి వినతి


ఎంపీడీవో రవికుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గొడ్డటిపాలెం వార్డు సభ్యులు

కరప: మండలంలోని గొడ్డటిపాలెం గ్రామానికి స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని కోరుతూ గొడ్డటిపాలెం గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు సోమవారం జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేశారన్నారు. ఉపసర్పంచ్ జి.అనూషా గ్రామ పరిపాలన బాధ్యతలు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, ఇందుకు తాము వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొన్నారు. తిరిగి సర్పంచ్ ఎన్నిక నిర్వహించే వరకు ఒక ప్రత్యేకాధికారిని నియమించాలని డీపీవోకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎంపీడీవో మట్టపర్తి అనుపమలను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. వార్డు సభ్యులు గంజా ప్రేమరత్నం, పి.నాగబాబు, జి.గోవిందరాజు, వి.లక్ష్మీదుర్గ, వి.సురేష్, నక్కా గంగాభవానీ, సీహెచ్ మణికంఠ, ఎస్.భవానీలు పాల్గొన్నారు.

సినిమాలు

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్:	దేవర పార్ట్–1, దక్షిణ, సత్య సుందరం
దేవీ మల్టీప్లెక్సు 4 స్క్రీన్స్:	దేవర పార్ట్–1, సత్య సుందరం, కాళీ
లక్ష్మి:	దేవర పార్ట్–1
సత్యగౌరి:	దేవర పార్ట్–1
తిరుమల:	దేవర పార్ట్–1
సీఅండ్‌సీ1:	మత్తువదలరా
సీఅండ్‌సీ2:	స్వాగ్
శ్రీప్రియ:	రామ్ నగర్ బన్ని
పద్మప్రియ:	దేవర పార్ట్–1
సూర్య (వాకలపూడి):	దేవర పార్ట్–1
సూర్య2:	మిస్టర్ సెలబ్రిటీ

శ్రీపీఠం.. ఆధ్యాత్మిక శోభితం

అమ్మ ఆశీస్సులు ఉంటే... సకల కార్యాలు దిగ్విజయంగా జరుగుతాయనేందుకు రమణయ్యపేటలోని శ్రీపీఠం నిదర్శనంగా నిలుస్తోంది. ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామి కొలువైన శ్రీపీఠం నేడు భక్త జన సంద్రంగా మారింది. దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకుని స్వామిజీ పరిపూర్ణానంద మహాశక్తి యాగం తలపెట్టారు. గత ఏడాది కార్తీక మాసంలో నిర్వహించిన మహాశక్తి యాగాన్ని తలపించేలా మహిళలు తరలి వస్తున్నారు. శ్రీపీఠం ద్వారా ఏర్పాటు చేసి ఏకరూప చీరలు(దీక్షా వస్త్రాలు) ధరించి మహిళలు తరలి వస్తుంటే... అమ్మవార్లే నడిచి వస్తున్నట్టుగా భక్తులు భావిస్తున్నారు.

- గత ఏడాది కార్తిక మాసంలో మహాశక్తి యాగం కంటే అధికంగా భక్తులు
- దసరా నవరాత్రుల్లో ఆధ్యాత్మిక శోభ
- లలితా సహస్రం, కుంకుమార్చనలతో తరిస్తున్న మహిళలు
- వలంటీర్ల ద్వారా రోజూ 35 వేల మంది భక్తులకు అన్న ప్రసాదం వడ్డన

కాకినాడ రూరల్: దేవీశరన్నవరాత్రులు 3న ప్రారంభమవ్వగా ఐదు రోజులు భక్తులతో శ్రీపీఠం నిండిపోయింది. కాకినాడ, పరిసర గ్రామాలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలు, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. ప్రతి రోజూ సుమారు 30 వేల నుంచి 40 వేల వరకు మహిళలు దీక్షా వస్త్రాలతో ఉదయం 10 గంటలకు జరిగే కుంకుమ పూజల్లో పాల్గొంటున్నారు. సకల దేవతలకు ప్రతి రూపమైన లలితా అమ్మవారికి సహస్ర నామాలతో కుంకుమార్చనలు స్వయంగా మహిళలే చేపడుతున్నారు. ఏటా దసరా ఉత్సవాలలో భాగంగా సాధారంగా కుంకుమ పూజలు నిర్వహించేవారు. ఈ ఏడాది మహాశక్తి యాగం పేరిట దేవీ శరన్నవరాత్రులు నిర్వహిస్తూ లలితా సహస్ర నామార్చనలు నిర్వహిస్తున్నారు. దీంతో శ్రీపీఠం, పరిసర ప్రాంతాలలో ఆధ్యాత్మిక పవనాలు వీస్తున్నాయి. కుంకుమ పూజల అనంతరం భక్తులకు ఉచిత అన్న ప్రసాదం సుమారు 20కి పైగా కౌంటర్ల ద్వారా అందిస్తున్నారు. పరిపూర్ణానంద స్వామి ఆశీస్సులతో భక్తులు, దాతల సహకారంతో రోజూ 35 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అధిక సంఖ్యలో వలంటీర్లుగా సేవలందిస్తున్నారు. సాయంత్రం రోజుకో అలంకరణతో అమ్మవారు దర్శనం ఇస్తుండగా విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తూ సకల జనులు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని వేద పండితులు మంత్రోచ్చారణ జరుపుతున్నారు.


శ్రీపీఠంలో లలితా సహస్ర నామ కుంకుమార్చనలో దీక్షా వస్త్రాలతో భక్తులు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో నిమగ్నమైన పోలీసులు

శ్రీపీఠంలో నిర్వహిస్తున్న మహాశక్తి యాగం కుంకుమ పూజల్లో పాల్గొనేందుకు వేలాదిగా తరలి వస్తున్న భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని పిఠాపురం – కాకినాడ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా వారు శ్రమిస్తున్నారు. మరో వైపు మహిళలతో పాటు వృద్ధులు అధిక సంఖ్యలో తరలివస్తుండడంతో వారికి ఉచిత వైద్యసేవలతో పాటు అందుబాటు అంబులెన్స్ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచారు.


అమ్మవారిని పూజించేందుకు కుంకుమతో వస్తున్న మహిళలు


అన్న ప్రసాదం గురించి స్వయంగా ఆరా తీస్తున్న పరిపూర్ణానంద స్వామి

అమ్మవారే అన్నీ జరిపించుకుంటున్నారు



శ్రీపీఠంలో మహాశక్తి యాగం విజయవంతంగా జరుగుతోంది. అమ్మవారే అన్ని క్రతువులు జరిపించుకుంటున్నారు. అమ్మ దయ లేకుండా అన్ని వేల మందికి భోజనం పెట్టలేం. భక్తుల పూజకు కావాల్సిన కుంకుమతో పాటు అన్ని ఏర్పాట్లు చేశాం. అన్న ప్రసాదం అందిస్తున్నాం. బుధవారం 24వేల మందితో సరస్వతి మంది పూజ, గురువారం 64 వేల మందితో కుంకుమ పూజ నిర్వహిస్తాం.

– పరిపూర్ణానంద స్వామి, శ్రీపీఠం, రమణయ్యపేట, కాకినాడ రూరల్.

కాకినాడకు పట్టిన అదృష్టంగా భావిస్తున్నాం..



శ్రీపీఠంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న కుంకుమ పూజలు కాకినాడ నగరానికే పట్టిన అదృష్టంగా భావిస్తున్నాం. శక్తిపీఠం మాదిరిగా ఇక్కడ పూజలు జరుగుతున్నాయి. వేలాది మంది కుంకుమ పూజలు చేసుకుంటున్నారు. ఇదో అద్భుతం.

– బి.రత్నమాల భక్తురాలు, కాకినాడ.

వలంటీరుగా సేవలు



శ్రీపీఠంలో కుంకుమ పూజలు చేసుకునే భక్తులకు సేవ చేయాలనే భావనతో వలంటీర్లుగా సేవలందిస్తున్నాం. మా గ్రామం నుంచి గత ఏడాడి మహాశక్తి యాగంలో పాల్గొన్నాం. ఇప్పుడు మళ్లీ అదే వైభవం. గతం కంటే ఎక్కువ మంది భక్తులు వస్తున్నారు. అన్న ప్రసాదం వడ్డన, కుంకుమ అందించడం వంటి సేవలు చేస్తున్నాం.

– నక్కా శ్రీలక్ష్మి, భక్తురాలు, అరట్లకట్ట, కరప మండలం.

దేశాభివృద్ధిలో ఆర్కిటెక్చర్‌ల పాత్ర కీలకం


దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: దేశ భవిష్యత్తును రూపొందించడంలో ఆర్కిటెక్చర్లు ప్రముఖ పాత్ర పోషిస్తారని ప్రముఖ ఆర్కిటెక్చర్ లావేటి వెంకట దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆర్కిటెక్చర్ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. 1985 నుంచి అక్టోబర్ మొదటి సోమవారం ప్రపంచ ఆర్కిటెక్చర్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. ఆర్కిటెక్చర్ అనేది భవనాలు, ప్రాజెక్టుల నిర్మాణాలే గాక మానవ జీవితంలోని ప్రతి అంశంతో ముడిపడి ఉంటుందన్నారు. అందమైన భవనాలు రూపొందించడంలో ఆర్కిటెక్చర్ ప్రముఖ పాత్ర పోషిస్తారని దుర్గాప్రసాద్ తెలిపారు .అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, జి.కృష్ణమోహన్, నాని, ప్రసాద్ నాయుడు, రాజా తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద పాఠశాలలో దసరా ఉత్సవాలు


మహిషాసుర మర్దిని నృత్యం చేస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: వివేకానంద మధురానగర్ పాఠశాలలో సోమవారం దసరా ఉత్సవాలు నిర్వహించారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు మహిషాసుర మర్దిని వేషధారణలో విజయదశమి ప్రాముఖ్యతను తెలియజేశారు. నవరాత్రుల సమయంలో ప్రతిరోజు అమ్మవారి వేషధారణ, అలంకరణలతో పాటు సంస్కృతీ సంప్రదాయాల విశిష్టతను తెలియజేసేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ సరోజిని, ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించాలని వినతి

కాకినాడ సిటీ: కాకినాడ టౌన్ బ్రిడ్జి నుంచి మెయిన్ రోడ్, దేవాలయం వీధి, నూకాలమ్మ గుడి వీధి, సాలిపేట గరల్స్ హైస్కూల్ ప్రాంతాల్లో కలెక్టర్ ఉత్తర్వులు లెక్క చేయకుండా విచ్చలవిడిగా కట్టిన ఫ్లెక్సీలు తొలగించాలని కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో పౌరసంఘం నాయకులు ఫిర్యాదు అందించారు. జవహర్‌వీధిలో ఘంటసాల విగ్రహం మూసేసిన ఫ్లెక్సీ తీరు చోద్యంగా ఉందన్నారు. రూ.లక్షలు వెచ్చించి వేయించిన పెయింటింగ్స్ మీద వాల్ పోస్టర్లు వెలుస్తున్నప్పటికీ సిటీ ప్లానింగ్ అధికారులు తమకు వ్యవహరించటం తగదన్నారు. టు టౌన్ బ్రిడ్జి మీద రైలింగ్ తుప్పు పట్టి సిమెంట్ శిథిలాలు కిందకి జారిపడుతున్న దుస్థితిలో ఉన్నప్పటికీ విద్యుత్ స్తంభాలకు రెండు వైపులా 36 స్తంభాలకు 72 భారీ ఫ్లెక్సీ బోర్డులు కట్టించి ఐదు రోజులు అవుతుందన్నారు. కలెక్టర్ ఉత్తర్వులు ఉల్లంఘించిన బాలత్రిపుర సుందరి ఆలయ ఈవో వైఖరిపై ఎటువంటి నోటీసులు గానీ, తొలగింపు చర్యలు తీసుకోకపోవడం దురదృష్ట కరమన్నారు. జగన్నాథపురంలో ప్రతి ప్రధాన రహదారి ఫ్లెక్సీలతో నిండిపోయిందన్నారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్‌లో ఫ్రీ ఫ్లెక్సీ సిటీ అమలు కోసం సాక్ష్యాధారాలతో ఫోటోలు, వీడియో క్లిప్పింగ్స్ జత చేసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిటీ ద్వారా ఫిర్యాదు చేస్తామని పౌరసంఘ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు తెలిపారు.

బాబా ఆలయాలపై దాడులు హేయనీయం


సమావేశంలో మాట్లాడుతున్న బాబా భక్తులు

బోట్‌క్లబ్: ఉత్తరప్రదేశ్‌లో సాయిబాబా ఆలయాలపై జరుగుతున్న దాడులు హేయనీయమని బాబా భక్తుడు చోడిశెట్టి కాశీ విశ్వేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక కెమిస్ట్ అసోసియేషన్ భవన్లో ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. సాయిబాబా భక్తులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారని ఆయన్ని ఒక మార్గదర్శిగా చేసుకుని ఒక గురువుగా ఎవరికి తోచిన విధంగా వారు కొలుస్తున్నారన్నారు. విదేశాల్లో భక్తి శ్రద్ధలతో ఆయనను పూజిస్తుంటే మనదేశంలో హిందూ ధర్మం పాటిస్తున్నామని చెప్పుకునే ఉత్తర ప్రదేశ్‌లో సాయిబాబా ఆలయాలపై జరుగుతున్న దాడులను ఖండించకపోవడం సాయి భక్తులుగా తమకు తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నాయని వెల్లడించారు. ఇప్పటికైనా సాయి భక్తులు అంతా శాంతియుతంగా తమ నిరసనలు తెలియజేసి జరుగుతున్న దాడులను అరికట్టాలని పిలుపునిచ్చారు. సాయిబాబా ప్రజలతో మమేకమై తిరిగారే తప్పా ఎక్కడా తాను దేవుడినని పేర్కొనలేదన్నారు. తాను జీవించినంత కాలంలో ఎక్కడా ఏ మతం మీద దాడులు చేయవద్దంటూ మత సామరస్యానికి పాటు పడ్డారని బాబా భక్తులు చెప్పారు. ఈ సమావేశంలో బాబా భక్తులు కోలా నరసింగరావు, కుమానపల్లి వెంకట సుబ్బారావు, ముమ్మిడి సత్తిబాబు, గొల్లపల్లి పెద్దకాపు, దామిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి


పాలస్తీనాపై ఇజ్రాయెల్ దౌర్జన్యాన్ని ఖండిస్తూ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాలు

కాకినాడ సిటీ: పాలస్తీనాపై యుద్ధం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా ఇజ్రాయెల్ యుద్ధ ఉన్మాదాన్ని, అమెరికన్ సామ్రాజ్య వాద దౌర్జన్యాన్ని ఖండిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా వామపక్షాలు సోమవారం కలెక్టరేట్ నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన నిరసన సభలో కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగల ప్రభాకర్ మాట్లాడారు. జాత్యహంకార ఇజ్రాయెల్ ఏడాది కాలంగా పాలస్తీనాపై యుద్ధం చేస్తూ దాదాపు 42 వేల మంది ప్రాణాలు హరించిందన్నారు. దీని వల్ల 26 లక్షల మంది ప్రజలు నిర్వాసితులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. గాజా ప్రాంతం మొత్తం 60 శాతం ధ్వంసం అయిపోయిందన్నారు. ఇజ్రాయెల్‌కి ఆయుధాలు అమ్ముకుంటూ యుద్ధాన్ని ప్రోత్సహిస్తున్న అమెరికన్ సామ్రాజ్య వాదాన్ని ప్రజలు ఖండించాలని ఆందోళన కారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు జె వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, బోడకొండ, పౌరసంక్షేమ సంఘం అధ్యక్షులు దూసర్లపూడి రమణరాజు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు తిరుమల శెట్టి నాగేశ్వరరావు, పి వీరబాబు, పెద్దింశెట్టి రామకృష్ణ, చింతపల్లి అజయ్‌కుమార్, తోకల ప్రసాద్, టి రాజా, ఎంవీ రమణ, పద్మ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అమ్మలగన్న అమ్మ..కనకదుర్గమ్మ..


జపమాల అలంకరణలో దర్శనమిచ్చిన బాలాత్రిపుర సుందరి


అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన దేవాలయంవీధి బాలాత్రిపుర సుందరి


కూష్మాండిక అలంకరణలో దర్శనమిచ్చిన మాధవనగర్ కనకదుర్గమ్మ


శాకాంబరిగా దర్శనమిచ్చిన అశోక్‌నగర్ బాబా ఆలయంలో అమ్మవారు


జపమాల అవతారంలో పర్వత వర్ధినీదేవి అమ్మవారు

- భక్తులతో కిటకిటలాడుతున్న దేవీ ఆలయాలు
- పలు ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదవరోజు సోమవారం అమ్మవారు వివిధ అలంకరణలలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు జపమాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పళ్లంరాజు అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ ఈఓ వీర్రాజు చౌదరి ఆలయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రసాదం అందించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గాయత్రి గాన మంజరి ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి కీర్తనలు ఆకట్టుకున్నాయి. జగన్మాత నాట్యాలయ విద్యార్థుల నృత్య ప్రదర్శన అలరించింది. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దాతల సహకారంతో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. మాధవనగర్‌లో ఉన్న కనకదుర్గ అమ్మవారు కూష్మాండిక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో నవవర్ణార్చన, కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అశోక్‌నగర్ షిర్డీసాయిబాబా ఆలయంలో అమ్మవారు శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్యుత రామారావు, నాగ పద్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని గాజులతో పూజించారు. స్థానిక భాను గుడి భానులింగేశ్వర స్వామి ఆలయంలో మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సంతచెరువు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో భక్తులు విశేషంగా కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జపమాల అవతారంలో పర్వత వర్ధినీదేవి

కరప: స్థానిక శివాలయంలో పర్వత వర్ధినీదేవి సోమవారం జపమాల అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.